క్లుప్తంగా

గణపవరంలో గ్రామోత్సవం



నాదెండ్ల: మండలంలో హనుమత్ జయంతి వేడుకలు రెండోరోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. కోదండ రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారిని అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాస రావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు తెలిపారు. ఆకుపూజ, సింధూరం, పండ్లతో అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం ప్రసాదాల పంపిణీ జరగనుంది.

ఘనంగా హనుమాన్ బ్రహ్మోత్సవం



వినుకొండ: పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయులు స్వామి వారి దేవస్థానంలో 45వ వార్షిక హనుమాన్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2వ రోజు బుధవారం హనుమాన్ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గజవల్లి నాగపవన్‌కుమార్, శ్రీమన్నారాయణ, చిలంకూరి కోటేశ్వరరావు మండవ వెంకటకిరణ్‌కుమార్, దేవాదాయ శాఖ జేఈ లింగా శివలింగప్రసాద్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషను శిక్షణ తరగతులు ప్రారంభం

శావల్యాపురం: బీసీ కార్పొరేషన్ సారథ్యంలో మండలంలోని 120 మంది మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు మిషను శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కుట్టు మిషను సెంటరు ప్రతినిధి యం.ఝాన్సీలక్ష్మి బుధవారం తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపికైన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిలో ఆసక్తి ఉన్న మహిళలు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హత కల్గియున్న మహిళలను ఎంపికై నట్లు తెలిపారు. మూడు నెలల వ్యవధిలో ఉచితంగా టైలరింగ్ నైపుణ్యం విభాగంలో ఉచితంగా శిక్షణా ఇస్తామని 80 శాతం అన్‌లైన్ ఫోటోతో కూడిన హాజరు శాతం ఉంటేనే ప్రభుత్వ పరంగా ధ్రువీకరణ పత్రం కుట్టుమిషను ఉచితంగా అందజేస్తామన్నారు. కుట్టు మిషను సెంటరు శిక్షణా తరగతులు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యను మర్యాద పూర్వకంగా కలిసి సెంటరు నిర్వహణ పనితీరు సమయాభావం తదితర అంశాలను వివరించారు.

అలరిస్తున్న కళాపరిషత్ నాటిక ప్రదర్శనలు



వినుకొండ: ఎన్టీఆర్ 102వ జయంతి పురస్కరించుకొని నందమూరి తారక రామారావు కళా పరిషత్ నాటకోత్సవాలు 2వ రోజు మంగళవారం రాత్రి పట్టణంలోని జూనియర్ కళాశాలలో సందడిగా నిర్వహించారు. యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి నా శత్రువు నాటిక, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ సిరి మువ్వ కల్చరల్ వారి హక్కు నాటికలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామ కోటేశ్వరరావు, లగడపాటి వెంకట్రావు, మందా మరియబాబు, కౌన్సిలర్ షకీలా బేగం, పీవీ. సురేష్ బాబు, జనసేన పార్టీ నాగ శ్రీను రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

శోభాయమానంగా సిద్ధమవుతున్న అంజన్న ఆలయాలు, రామమందిరాలు

యడ్లపాడు: హనుమజ్జయంతి మహోత్సవాల నిర్వహణకు యడ్లపాడు మండలం సిద్ధమైంది. పురాణాలలో 'శక్తి, భక్తి, శౌర్యానికి ప్రతీక'గా చెప్పే ఆంజనేయస్వామి జన్మదినం సందర్భంగా మండలంలోని అనేక ఆలయాలలో ఘన వేడుకలు నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలకు మండల కేంద్రమైన యడ్లపాడులోని పురాతన రణవీరాంజనేయ స్వామి, ప్రపత్తి ప్రసన్నాంజనేయ స్వామి, బోయపాలెం జాతీయ రహదారి ప్రక్కనే ప్రసిద్ధి చెందిన శ్రీప్రసన్నాంజనేయ స్వామి, హరిహరక్షేత్ర ప్రాంగణంలోని భారీ హనుమాన్ విగ్రహంతో పాటు క్షేత్రంలోని ఉపాలయంలో కొలువున్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే తిమ్మాపురం అంజన్న ఆలయం, జాలాది హరిహర దత్త క్షేత్రం ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ ఉపాలయం, గోపాలపురంలోని ప్రసన్నాంజేయ స్వామి, సొలస శ్రీభూసమేత రంగనాయక స్వామి దేవస్థాన ప్రాంగణంలోని సిద్ధాంజనేయ స్వామి ఆలయాలతో రామమందిరాలు హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. వేడుకల నిర్వహణ సందర్భంగా పలు ఆలయాలకు కొత్త రంగులు, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాల అలంకరణ గావించారు. ఆకుపూజలు, హోమాలు, భజనలు, సామూహిక అర్చనలతో పాటు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



సొలసలోని సిద్ధాంజనేయ స్వామి విగ్రహం



కొత్త సొలసలోని వీర ఆంజనేయస్వామి



కొండవీడు కొండపై ప్రసన్నాంజనేయస్వామి



బోయపాలెంలోని భారీ ఆంజనేయస్వామి

వినుకొండలో...



వినుకొండ: హనుమజ్జయంతి వేడుకలు పురస్కరించు కుని పట్టణంలోని పురాతన గుంటి అంజనేయస్వామి దేవాలయంలో భక్తులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిఏటా స్వామివారి జయంతి సందర్భంగా మాలలు ధరించిన స్వాములు హనుమజ్జయంతి రోజున మండల దీక్ష విరమణ చేయడం ఆనవాయితీ గా వస్తుంది.

టపా ఆంజనేయస్వామియే గుంటి ఆంజనేయ స్వామి

సుమారు 60 ఏళ్లకు పూర్వం స్వామివారిని భక్తులు టపా అంజనేయస్వామి గా పిలచుకునేవారు. స్వామివారి ఏకశిలావిగ్రహం చెవులకు ఇరువైపులా రెండు గూళ్లు ఉండేవి భక్తులు అడ్రసు రాసి ఎవరికి పంపాలో పేర్లు రాసి గూట్లో ఉంచితే తెల్లవారే సరికి వారి ఇంటికి ఉత్తరాలు వెళ్లేవి అని భక్తులు చెబుతున్నారు. రానురాను గుంటి అంజనేయ స్వామిగా స్వామివారు భక్తుల సేవలు అందుకుటున్నారు.

20 ఏళ్లకు పైగా మాలలు

గుంటి అంజనేయ స్వామి వారిదేవస్థానంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు అన్నదానం చిదంబరశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారి మండల మాలలు వేయడం, స్వాములకు అన్నదానం చేయడం వంటి కార్యక్రమాలు ప్రారంభించారు. నేటికీ వేలాదిమంది భక్తులు స్వామివారి మాలధరించడం ఆనవాయితీగా వస్తుంది.

సిద్ధమైన ఆలయాలు

పట్టణంలోని గుంటి అంజనేయస్వామి దేవాలయంతో పాటు దక్షిణంబజారు గమిడి అంజనేయస్వాయి దేవాయం, రంగనాయకస్వామి దేవాలయం, ఉట్లాబత్తుని ఆంజనేయస్వామి దేవాలయాలతోపాటు పలుదేవాలయాలల్లో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు అన్నదానాలు చేసేందుకు భక్తులు ఆలయకమిటీల సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జాబ్‌మేళాలో 265 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు 23 కంపెనీలు హాజరై అర్హత గల నిరుద్యోగ యువతను తమ తమ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక చేసారు. దాదాపు 675 మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరు కాగా 265 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిధులుగా పాల్గొని ఎంపికైన వారికి ఆయా కంపెనీల నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాలలో చేరి అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే తమ విద్యార్హత సర్టిఫికెట్లకు విలువ పెరుగుతుందని తెలిపారు. కేవలం మార్కులతోనే ఉద్యోగాలు లభించవనీ, వాటితో పాటు నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే పోటీ ప్రపంచంలో అవకాశాలు మెరుగుపడతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు, అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి వి.రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ పి.ఝాన్సీరాణి, మెప్మా పీడీ వి.విజయలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



కంపెనీల ఆఫర్ లెటర్స్‌తో అభ్యర్థులను అభినందిస్తున్న డాక్టర్ అరవిందబాబు, గోనుగుంట్ల

సంక్షిప్త వార్తలు

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడికి డాక్టరేట్

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో సివిక్స్ పీజీటీగా పనిచేస్తున్న యర్రసాని శ్యామ్‌కృపాకర్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని ప్రభావితం చేసే కారకాలపై పరిశోధన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో సెకండరీ స్థాయిలోని ఉపాధ్యాయ విద్యలో వృత్తిపూర్వక ఉపాధ్యాయ విద్య, వృత్యాంతర ఉపాధ్యాయ విద్య యొక్క పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ ఎం ఎస్తేర్‌సునీల పర్యవేక్షణలో పూర్తి చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి కె గంగాధర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయుడు శ్యామ్ కృపాకర్‌ను ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

పాలకులు దిగొచ్చే వరకు పోరాటం ఆగదు

నరసరావుపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోరాటం ఆపేది లేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్ మసూద్ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ (సీఐటీయు) ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారంతో 63వ రోజుకు చేరుకుంది. కార్మికులు నిరవధిక సమ్మె ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటెల్‌తో ఎన్ఈసీ ఒప్పందం

నరసరావుపేట రూరల్: ప్రముఖ కంప్యూటర్ మైక్రో ప్రాసెసర్ సంస్థ ఇంటెల్‌తో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటెల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంటెల్ కస్టమర్ ఇంజనీరింగ్ లీడ్ ఆనంద్ కులకర్ణి, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ కులకర్ణి మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఇంటెల్ అధునాతనమైన టెక్నాలజీ ఎన్ఈసీ విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందన్నారు. దీని వలన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ఉద్యోగ అవకాశాలను సాధించవచ్చని తెలిపారు. మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ ఏపీ నుంచి ఇంటెల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న తొలి కళాశాలగా నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల నిలిచిందని తెలిపారు. ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణ కార్యక్రమాలు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు ఇంటెల్ సుశిక్షితులైన ఇంజనీర్స్ ద్వారా సర్టిఫికేషన్స్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ వీవీఎస్ లక్ష్మీ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నాదెండ్ల: ప్రతి మనిషి దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని యోగా శిక్షకురాలు, కనపర్రు ప్రాథమిక పాఠశాల (బీపీఆర్) హెచ్‌ఎం వై.రాజ్యలక్ష్మి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపారాణి, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నుంచి నెలరోజుల పాటూ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం తలపెట్టిందని, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపనున్నట్లు తెలిపారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ములకలూరు గ్రామ శివారులోని శ్రీ విజయలక్ష్మి టౌన్‌షిప్ వేద మెడోస్ వెంచర్ నిర్వాహకులు పంట కాలువలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు, రోడ్లు, గార్డెన్ నిర్మాణం చేసిన వారి మీద చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధ వారం లింగంగుంట్ల ఎస్ఎస్పీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి డీఈ కె.నాగబాబుకు వినతి పత్రం అందజేశారు. తాము గత కొంతకాలం నుంచి చేస్తున్న ఆందోళన మేర అధికారులు కొంత కాలువను పునరుద్ధరించే ప్రయత్నం చేశారన్నారు.

గేదెలను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

నాదెండ్ల: జాతీయరహదారి నూతన బైపాస్ రోడ్డుపై గేదెలను గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు దూడలు మృత్యువాతపడగా, మరో రెండు గేదెలు గాయాలపాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల శివారు జాష్టివారిపాలెం గ్రామానికి చెందిన పశుపోషకులు మార్త వీరాంజనేయులు, హనుమంతరావు తెలిపిన వివరాల మేరకు వేసవి కావటంతో గేదెలను మేతకు వదిలేసినట్లు తెలిపారు. రాత్రి అయినా గేదెలు ఇంటికి తిరిగి చేరుకోకపోవటంతో వెతుకులాట ప్రారంభించగా, తెల్లవారుజామున జాతీయ రహదారి నూతన బైపాస్‌పై రెండు దూడలు మృతి చెందగా, ఒక గేదె కొమ్ము విరగ్గా, మరో గేదె నడుములు విరిగాయి. మృతి చెందిన దూడల విలువ రూ.20 వేలకు పైగా ఉంటుందని పశుపోషకులు వాపోయారు.

పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యాకిట్లు అందిస్తాం



బ్యాగ్స్ సిద్ధం చేస్తున్న సీఆర్‌పీలు

శావల్యాపురం: పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే వారందరికీ ప్రభుత్వం ఉచితంగా సర్వేపల్లి రామకృష్ణ విద్యాకిట్లు అందజేస్తున్నట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 39 ఎంపీపీ, జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా ఈవిద్యా సంవత్సరంలో 2972 మంది విద్యార్థులు 1 నుంచి 10 తరగతులు వరకు చదువుతున్నారన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం–3 జతలు, బ్యాగ్స్, షూస్, సాక్సులు, బెల్టులు, తదితరవన్నీ ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాగ్స్– 3 వేలు, పాఠ్యపుస్తకాలు–6 వేలు ఇప్పటికే వచ్చాయని పాఠశాలల వారీగా సీఆర్‌పీల పర్యవేక్షణలో కిట్లు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఆయనతో పాటు సీఆర్‌పీలు ఏలిక శ్రీనివాసరావు, కొండలు, కార్యాలయ సిబ్బంది శ్రీహరి, తివిక్రమ్, మస్తాన్‌రావులు ఉన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

ఎంపీపీ సుహాసిని



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం: అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో గోకులం షెడ్లు నిర్మించి నెలల గడుస్తునా నేటి వరకు బిల్లులు మంజూరు కాలేదని ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుహాసిని మాట్లాడుతూ అర్హత కల్గియున్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు వచ్చే నెల 21 వరకు జరుగుతాయని, మండల, గ్రామస్థాయిలో కమిటీల పర్యవేక్షణలో యోగా దినోత్సవం వేడుకలు నెలరోజుల పాటు జరుగుతాయన్నారు. యోగా చేయడం వల్ల కలుగు ప్రయోజనాలు ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు యోగాసాలు కూడా వేయించాలన్నారు. తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ మాట్లాడుతూ నూతనంగా రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందని ఇప్పుటి వరకు మండలంలోని సచివాలయాల నుంచి అన్‌లైన్ ద్వారా 345 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అర్హత కల్గియున్న వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నూతన విద్య విధానాలను అమలు చేసిందన్నారు. ఇందులో భాగంగా మండలంలోని పోట్లూరు ప్రైమరీ, హరిజన కాలనీ ఎంపీపీ స్కూలు, శావల్యాపురం, కనమర్లపూడి, కారుమంచి,మతుకుమల్లి ఆరు ఎంపీపీ స్కూలు ఎంపికైనట్లు తెలిపారు. 65 మంది విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలు గుర్తించగా ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించారన్నారు.. 20 బేసింక్ ప్రైమరీ స్కూల్స్ ఎంపిక చేయగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు నియామకం జరుగుతుందన్నారు. పౌండేషన్ స్కూల్స్ వయ్యకల్లు, పిచికలపాలెం ఎస్సీకాలనీల్లోని ఎంపీపీ స్కూల్స్ ఎంపిక చేశారన్నారు. సర్వసభ్య సమావేశానికి నామమాత్రంగా ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరు అయారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి,ఏవో రామినేని రామారావు,ఏఈ జవ్వాజీ నటరాజ్, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రొంపిచర్ల : రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం సీపీఐ రొంపిచర్ల గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ నైరుతి రుతుపవనాలు వస్తున్న సందర్భంగా ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. దీనివలన పొలాలు చదును కావడం వలన రైతులు దుక్కి దున్ని, సాగుకు సిద్ధమౌతున్నారని అన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కల్తీ లేకుండా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. స్వామినాథన్ కమీషన్ అమలు చేసి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు సంవత్సరంలో 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. అర్హులైన నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ రొంపిచర్ల గ్రామశాఖా కార్యదర్శిగా ముప్పూరి మధుసూదనరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మోహనరావు, పిడెం హుస్సేన్, సుభానీ, నాగూర్, సాంబశివరావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై కూటమి నిర్లక్ష్యం

సీహెచ్‌ఓల సమ్మెకు మద్దతుగా ప్రచార కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఉద్దేశించిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేయడమే కాక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ)లను సమ్మెబాట పట్టించి గ్రామీణ పేద ప్రజల వైద్య–ఆరోగ్యాలను కూడా ప్రమాదంలో పడేసిందని ప్రజా సంఘాల నేతలు విమర్శించారు. స్థానిక గాంధీ పార్కు ఎదుట గత నెల 24 నుంచి కొనసాగుతున్న సీహెచ్‌ఓల సమ్మె శిబిరంలో బుధవారం పాల్గొని పోరాటానికి మద్దతుగా ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. వర్షాకాలం ఆరంభమైనందున డయేరియా లాంటి వ్యాధులు గ్రామాలలో విజృంభించే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సీహెచ్‌ఓల న్యాయమైన కోర్కెలను ఆమోదించాలని డిమాండ్ చేశారు. ప్రజా గాయకులు కృష్ణ, బ్రహ్మయ్య 'ఈ దేశం ఎవడిది రా– ఈ దేశం మనదేరా' అనే ప్రజా పోరాట గీతం ఆలపించి అలరించారు. గాంధీ స్మారక సమితి, ఏఐటీయూసీ, సీఐటీయూ, పీడీఎం, కుల నిర్మూలన పోరాట సమితి, పీకేఎస్, ఎపీఎంసీఏ నాయకులు ఈదర గోపీచంద్, కాసా రాంబాబు, షేక్ సిలార్ మసూద్, నల్లపాటి రామారావు, క్రిష్ణ, వై.వి.మస్తాన్, ప్రసాద్, బ్రహ్మయ్య, సీహెచ్‌ఓల సంఘం ఏపీ ఎంసీఏ తరపున జిల్లా అధ్యక్షులు అనుపమ, రాము, పార్వతి, శివ,మస్తాన్, పెద్ద సంఖ్యలో మహిళా సీహెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

నరసరావుపేట: తిరుపతి మోహన్‌బాబు కళాశాలలో జేమ్స్ అనే ఎస్సీ విద్యార్థిని తీవ్రంగా కొట్టి యూరిన్ తాగించిన నేరస్తులను ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదుచేసి అరెస్ట్ చేయాలని ఆంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కాల్వరవి మాదిగ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యకి పాల్పడిన ప్రతి ఒక్కరిపై అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

రొంపిచర్లలో 4.2 ఎం.ఎం వర్షపాతం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షపు జల్లులు కురిసాయి. కాగా మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం ఉదయానికి 4.2 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా మండలంలో నెలకొన్న వాతావరణం చల్లగా ఉండటంతో గ్రీష్మతాపాన్ని నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వాతావరణం మరో నాలుగు రోజుల పాటు కొనసాగితే పూర్తి వాతావరణం చల్లబడుతుందని అనుకొంటున్నారు. ఈ ఏడాది తొలకరి చినుకులు ముందుగానే కురియడం, రుతుపవనాలు కూడా తొందర్లోనే వస్తాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులు పంటల సాగుపై ఆలోచిస్తున్నారు. ఈ వాతావరణం, వర్షం అనుకూలిస్తే తొలకరిలోనే అపరాల పంటలతో పాటు వాణిజ్య పంటలైన పత్తి పంట సాగుచేసే ఆలోచనలు రైతుల్లో మెండుగా కనిపిస్తున్నాయి.

సర్టిఫికెట్స్ పోయినవి

చీదెళ్ళ వెంకట అరుణ్‌కుమార్ S/o మల్లిఖార్జునరావు D.No: 7-4-101/1, శ్రీరాంపురం నరసరావుపేట అనునేను జిరాక్స్ నిమిత్తం మా ఇంటి వద్ద నుండి మోర్ సెంటర్ వద్ద గల జిరాక్స్ షాపుకు వెళ్తుండగా నా ఇంటర్ సర్టిఫికెట్ 050692384 నెంబర్ గల సర్టిఫికెట్ పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెం. 7416203376 కు తెలియచేయగలరు.

సర్టిఫికెట్స్ పోయినవి

లింగా కల్పనా S/o చీదెళ్ళ వెంకట అరుణ్‌కుమార్ D.No: 7-4-101/1, శ్రీరాంపురం నరసరావుపేట అనునేను జిరాక్స్ నిమిత్తం నా సర్టిఫికెట్స్ 10th క్లాస్ 0289555 ఇంటర్ 050754353, B.Tech 05471A1216, M. Tech 12U91D5807 నెంబర్స్ గల సర్టిఫికెట్స్ జిరాక్స్ నిమిత్తం మా ఇంటి నుండి మోర్ సెంటర్ వద్ద గల జిరాక్స్ షాపుకు వెళ్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెం. 7416203376 కు తెలియచేయగలరు.

త్వరలో ఆర్‌యూబీ పనులు ప్రారంభం

గుంటూరు రైల్వే డీఆర్ఎం సుదేష్టాసేన్

శావల్యాపురం: శావల్యాపురం రైల్వే గేటు (268) వద్ద త్వరలో ఆర్‌యూబీ పనులు ప్రారంభిస్తామని గుంటూరు రైల్వే డీఆర్‌యం సుదేష్టాసేన్ వెల్లడించారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషను డీఆర్ఎం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ నడికుడి–మాచర్ల రైల్వే స్టేషన్లు సాధారణ తనిఖీలు చేశామని అందులో భాగంగా శావల్యాపురం రైల్వేస్టేషను సందర్శించినట్లు తెలిపారు. శావల్యాపురం రైల్వే స్టేషనులో రైళ్లు నిలుపుదల చేయాలని కోరగా ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి వినతులు వస్తే ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు నిలుపుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నడికుడి నుంచి మార్కాపురం వరకు రైల్వే ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా రైలు నడపాలని కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్టేషను మాస్టరు మధుబాబుతో మాట్లాడి స్టేషను ప్లాట్‌ఫాం పనుల పురోగతి తదితర వాటి గురించి మాట్లాడి పనులు పెండింగ్‌లో లేకుండా త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. డీఆర్ఎంతో పాటు రైల్వే అధికారులు వి.సుబ్బారావు, రత్నకర్, శ్రీనాథ్, ప్రదీప్ ఉన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం

నరసరావుపేట: జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్లల్లోని ఆర్టీసీ స్థలాలను లీజు, అద్దె ప్రాతిపదికన 15 ఏళ్ల పాటు వ్యాపారులకు కట్టపెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈనెల 23వ తేదీ ఉదయం 11గంటలకు ఆర్టీసీ ప్రజారవాణా అధికారి చాంబర్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం .మధు బుధవారం పేర్కొన్నారు. స్థలాలపై పారిశ్రామిక వేత్తలకు వివరాలు తెలియచేస్తామన్నారు. ఈ స్థలాలపై నెల్లూరుకు చెందిన సంస్థ అధికారులు టెండర్లు పిలుస్తారన్నారు. కావున ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.